క్లుప్తంగా

నేడు మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు జరుగుతాయని చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం తెలిపారు. ఇందులో గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు, వీఐఏ పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా ఇక్కడికి సమీపంలోని గొల్లలపాలెం వద్ద ఉన్న ది సెడార్ పాఠశాల వద్ద ఉచిత దంత వైద్య శిబిరం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల ఉంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని తెలిపారు.

ఘనంగా సత్యసాయి సమితి వార్షికోత్సవం



సాయి గాయత్రీ పారాయణ చేస్తున్న భక్తులు

భీమునిపట్నం: భీమిలిలోని సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 21సార్లు ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తన, ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, అష్టోత్తర శతనామావళి, సాయి గ్రాయత్రి, లలితా సహస్రనామ, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వైద్యులు





గైనకాలజిస్ట్ విజయశ్రీ, డెంటిస్ట్ సురేఖ

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో కొత్తగా బదిలీపై వచ్చిన ఇద్దరు వైద్యులుశుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల స్త్రీ వైద్య నిపుణురాలు (గైనకాలజిస్ట్) కనకదుర్గ ఉద్యోగ విరమణ చేశారు. ఆమె స్థానంలో అగనంపూడి నుంచి వచ్చిన స్త్రీ వైద్య నిపుణులు పి.విజయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఇక్కడ దంత వైద్యులు (డెంటిస్ట్) డి.సిద్ధార్థ రామచంద్రాపురానికి బదిలీ కాగా ఆయన స్థానంలో యలమంచిలి ఆసుపత్రి నుంచి వచ్చిన దంత వైద్యురాలు బి.సురేఖ బాధ్యతలు స్వీకరించారు. రోగులకు అందుబాటులో ఉంటామని, సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు తెలిపారు.

యువత సన్మార్గంలో నడవాలి

మధురవాడ: యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా సన్మార్గంలో నడవాలని బ్రదర్ హనీ జాన్సన్ చెప్పారు. జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో యునైటెడ్ బాప్టిస్ట్ చర్చిలో బర్నబాస్ ప్రేమదాస్, మణికుమార్ ఆధ్వర్యంలో యూత్ ట్రీట్ నిర్వహించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో పలువురు పాస్టర్‌లు, విశ్వాసులు పాల్గొన్నారు.

నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డులకు దరఖాస్తులు

మహారాణిపేట: నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్, వాటర్(సముద్రం) కేటగిరీల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. జీవిత కాల సాధన సాహస కృత్య కేటగిరీల్లో మూడేళ్లలో అద్భుతమైన పనితీరు కనబరిచి విజయం సాధించిన వ్యక్తులు అర్హులన్నారు. వివరాలు, దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి https://awards. gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అప్‌లోడ్ చేసిన పత్రాలు, నామినేషన్ సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తును ఈనెల 4వ తేదీలోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేటంలో పనివేళల్లో సమర్పించాలని కోరారు.

శాకంబరిగా దుర్గాలమ్మ

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టుపై కొలువైన శ్రీ పంచముఖ ఆంజనేయ, షిర్డి సాయినాథ సహిత దుర్గాలమ్మ వారి ఆలయంలో దుర్గాలమ్మ వారు శుక్రవారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలు, పూలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 6.30 వరకు భక్తులకు దర్శనాలు కల్పించారు. పీఎం పాలెం సీఐ వై. రామకృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి సారె సమర్పణ

పలువురు భక్తులు అమ్మవారికి పులిహోర, గారెలు, దద్దోజనం, చక్కెర పొంగలి, బూరెలు, కొబ్బరి అన్నం, కట్టు పొంగలి, రవ్వ కేసరి, జిలేబి, కాజా, బాదుషా, బొబ్బట్లు తదితర తినుబండారాలతో సారె సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు, ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



కూరగాయల అలంకరణలో అమ్మవారు

అనుమతి కేంద్రాల ద్వారా ఈ-స్టాంపుల జారీ

ఆనందపురం : స్థిరాస్తుల లావాదేవీల్లో అవకతవకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ-స్టాంప్ విధానాన్ని ప్రవేశపెట్టి, కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్న వారికి వాటిని విక్రయించే అనుమతిని ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మండలంలోని వేములవలస, వెల్లంకి గ్రామాలలో గల బ్యాంక్ బీసీ పాయింట్ల నిర్వాహకులకు ఈ-స్టాంపింగ్ కామన్ సర్వీసును అందించడానికి ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. దీంతో కక్షిదారులు ఆ కేంద్రాలలో ఈ-స్టాంపులను కొనుగోలు చేస్తున్నారు.

ఈ స్టాంపింగ్ వల్ల కక్షిదారులకు ఎంతో వెసులుబాటు కలుగుతోంది. దీని వలన ట్యాంపరింగ్‌కు అవకాశం ఉండదు. పాత తేదీలతో ఇవ్వడం కుదరదు. ఈ స్టాంప్ పై సర్టిఫికేషన్ నంబరు, తేదీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పేరు, స్టాంప్‌ను ఎందు కోసం వినియోగిస్తారో వివరాలు అనగా క్రయదస్తావేజు, జీపీఏ, తనఖా వంటి అంశాలను ప్రింట్ చేసి స్టాంప్‌ను అందిస్తున్నారు. దీని వలన ఏ అవసరం కోసం స్టాంప్ కొనుగోలు చేస్తే ఆ అవసరానికే స్టాంప్‌ను వినియోగించవలసి ఉంటుంది.



ఈ-స్టాంపు

భూసమీకరణకు గ్రామసభలు

ఆనందపురం : మండలంలోని మూడు గ్రామాల్లో శుక్రవారం భూ సమీకరణకు రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. విశాఖ రెవెన్యూ డివిజన్ అధికారి హుస్సేన్ సాహెబ్ హాజరయ్యారు. పేదలందరికీ ఇళ్ల పథకం కోసం మండలంలోని ముకుందపురం, శొంఠ్యాం, కుసులువాడ గ్రామాల్లో భూ సమీకరణకు రైతులతో సమావేశం నిర్వహించారు. పేదలకు ఇళ్ల నిర్మించేందుకు భూ సమీకరణ జరుపుతున్నామని వివరించారు. ఈ మేరకు రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. నివేదిక రూపొందించి తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. తహశీల్దారు లోకవరపు రామారావు మాట్లాడుతూ మూడు గ్రామాల్లోని రైతుల భూముల వివరాలను ఆర్డీవోకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



శొంఠ్యాం సభలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

గురుపూజోత్సవానికి ఏర్పాట్లు

పీఎం పాలెం : బక్కన్నపాలెం రోడ్డులో గల అంజనాద్రిపై వెలసిన శ్రీ శృంగేరీ శంకర మఠంలో వ్యాసపూర్ణిమను పురస్కరించుకుని 3వ తేదీన జగద్గురు ఆది శంకర భగవత్పాదుల సన్నిధిలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆదిశంకరుల సన్నిధిలో గురు పాదుకలకు విశేష రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు విశేష అలంకరణ అనంతరం అర్చనలు, గురు పాదపూజ, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం ఉంటుందని ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదినారాయణ సేవలు అమోఘం

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో మూడు దశాబ్దాలుగా పోస్ట్‌మాన్‌గా పడిమి ఆదినారాయణ అమోఘమైన సేవలు అందించారని చిట్టివలస సబ్ పోస్ట్‌మాస్టర్ బోని చంద్రశేఖర్ కొనియాడారు. శుక్రవారం ఆదినారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం చిట్టివలసలో జరిగింది. ప్రతి ఉద్యోగి తాను పనిచేసిన చోట నిజాయితీగా పని చేయాలన్నారు. అలాంటి వారిలో ఆదినారాయణ ఒకరని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గుమస్తాలు గోపాలరావు, గౌరీశంకర్, పృథ్వీరాజ్, మెయిల్ ఓవర్సీర్ అప్పలరమణ, తపాలా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శింగనబంద పోస్ట్‌మాన్ ఆదినారాయణను సత్కరిస్తున్న తపాలా శాఖ సిబ్బంది

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

తగరపువలస: విద్యార్థులు వ్యక్తిగత పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణ, పర్యావరణం వంటి పలు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని భీమిలి జెడ్సీ బి.రాము తెలిపారు. చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఆయన మాట్లాడారు. చెత్తను క్లాప్ వాహనాలకే ఇచ్చేటట్టు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. చెత్తను వీధులు, డ్రైనేజీల్లో కాకుండా డబ్బాల్లో నిల్వ చేసి ఇంటి ముందుకు వచ్చే వాహనాలకు ఇచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అనుపమ జ్యోతిర్మయి, డైరెక్టర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భీమిలి జెడ్సీ రాము తదితరులు

బదిలీ అయిన హెచ్ఎంకు సన్మానం



హెచ్ఎం వెంకటరావును సన్మానిస్తున్న నాయకులు

ఆనందపురం : బోయిపాలెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా చేసి, బదిలీపై వెళ్తున్న వెంకటరావును గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పాడ సూరిబాబు, మాజీ సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు, తడ్డావు గోవింద్ తదితరులు వెంకటరావుకు శాలువా కప్పి, మొమెంటో అందజేశారు.

వలందపేటలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరోజాజీ తెలిపారు. శుక్రవారం ఆమె గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిల్ల సూర్యనారాయణ రెడ్డి, నగిరెడ్ల రాంబాబు, కోనాడ కనకారావు, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల అప్పలనూరమ్మ, మద్ది మహాలక్ష్మి, జీరు పద్మ తదితరులు పాల్గొన్నారు.



వలందపేటలో పర్యటిస్తున్న రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు పల్లా నాగరాజు తన జన్మదినం సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణం, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నేరేడు, వేప వంటి 30 మొక్కలు నాటారు. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.



కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న నాగరాజు

భక్తిశ్రద్ధలతో శారదాంబకు పూజలు



భక్తుల పూజలందుకున్న శారదాంబ అమ్మవారు

పీఎం పాలెం : బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువు దీరిన శ్రీ శారదాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్వచ్ఛమైన పాలరాతితో మలిచిన అమ్మవారి విగ్రహ మూర్తిని దర్శించుకోవడాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. అర్చనల అనంతరం అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 10 ఫిర్యాదులు

అల్లిపురం: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి పది ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి సునీత పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో 2వ జోన్‌కు రెండు, 5వ జోన్‌కు 4, 6వ జోన్‌కు 1, 8వ జోన్‌కు 3.. మొత్తం 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధి, ఎనిమిది జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు ఇష్టానుసారం డంప్ చేసినా జీవీఎంసీలో టోల్ ఫ్రీ నంబరు 18004250009కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ 8187897569కు పూర్తి వివరాలతో పంపితే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీపీ సునీత

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్షాల ధర్నా

తగరపువలస: విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ భీమిలి డివిజన్ వామపక్షాల నాయకులు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ట్రూ అప్ చార్జీల పేరుతో సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతోందన్నారు. రైతులకు నష్టం కలిగే స్మార్ట్ మీటర్ల ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. రూరల్ ఏఈఈ జాగరపు రాముకు వినతిపత్రం అందించారు. నిరసనలో వామపక్షాల నాయకులు అల్లు బాబూరావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, తూతిక సోమరాజు, భాగం లక్ష్మి, రవ్వ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



ఏఈఈ రాముకు వినతిపత్రం అందిస్తున్న వామపక్షాల నాయకులు

బంగ్లామెట్ట వైపు రాకపోకలు బహు కష్టం


తగరపువలస: భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట వాసులు కళాశాల బాలుర వసతి గృహం నుంచి జాతీయ రహదారి వైపు సర్వీస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో తరచూ జారిపడుతున్నారు. ఇక్కడ ఇరుకైన వాలు ఎక్కువగా ఉండటంతో పాటు మట్టి మార్గం కావడంతో ద్విచక్ర వాహనదారులు మధ్యలోనే బోల్తా పడుతున్నారు. గతంలో జాతీయ రహదారుల విస్తరణ సమయంలో మెట్టమార్గాన్ని సగానికి తగ్గించి సర్వీస్‌రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఇప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. నడిచి వెళ్లే వారితో పాటు ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా బంగ్లామెట్ట నుంచి సర్వీస్ రోడ్డుకు రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బంగ్లామెట్ట నుంచి కళాశాల వసతిగృహం వైపు సర్వీస్‌రోడ్డు

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కొమ్మాది: జ్యూస్ షాప్‌లో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సాగర్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద శ్రీ సిద్ధి వినాయక జ్యూస్ అండ్ మిల్క్ షేక్ సెంటర్ ఉంది. ఇందులో బానాల లక్ష్మణ్ (19) పని చేస్తున్నాడు. ఆయన ఐదేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈ యువకుడు గతంలో ఎండాడలో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరు నెలల కిందట ఇక్కడ సాగర్ నగర్‌లోని జ్యూస్ సెంటర్‌లో పనికి చేరాడు. యజమాని నాగిరెడ్డి ఢిల్లీరావు పనితో పాటు ఎంబీజే సముదాయంలోని ఆయన ఇంట్లోనే నివాసం ఉండేందుకు అవకాశం కల్పించాడు. అప్పటి నుంచి లక్ష్మణ్ ఇక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి యథావిధిగా వ్యాపారం ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకుని అందరూ కలసి భోజనం చేసి నిద్రించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీరావు లేచి చూసేప్పటికి లక్ష్మణ్ కనపడకపోవడంతో షాప్‌కు వెళ్లి చూశారు. షటర్ ఎత్తి చూడగా లక్ష్మణ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. సమాచారం అందుకున్న ఆరిలోవ ఎస్ఐ అప్పారావు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న లక్ష్మణ్

ఇద్దరు విద్యార్థులకు ఎల్ అండ్ టీ స్కాలర్‌షిప్

కొమ్మాది: స్థానిక గాయత్రి విద్యాపరిషత్ రుషికొండ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు ఎల్ అండ్ టీ బిల్డ్ ఇండియా స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రజని తెలిపారు.

ఈ విద్యార్థులకు ఎన్ఐటీలో కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ కోర్సుకు ఆర్థిక సహకారం అందించడంతో పాటు ఎల్ అండ్ టీలో ఉద్యోగాలు కల్పిస్తారని తెలియజేశారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ఎం.రుద్ర దేవ్, సీహెచ్ రాకేష్‌లను కళాశాల యాజమాన్యం అభినందించింది.

తహసీల్దారుకు బర్లపేటవాసుల వినతి

పద్మనాభం: కళ్లాలు, గొర్రెలు మందలు వేసుకుని పూర్వీకుల నుంచి ఉంటున్న ఆ భూమిని తమకే ఇవ్వాలని బర్లపేట వాసులు తహసీల్దార్ తోట శ్రీవల్లికి శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. సర్వే నంబర్లు 42/1, 42/2లో ఉన్న సుమారు పది ఎకరాల భూమిలో 70 ఏళ్ల నుంచి తాము కళ్లాలు, గొర్రెలు మందలు వేసుకోవడం, కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. ఈ భూమిని ప్రభుత్వం తమకు కేటాయించిందని రూపాకుల రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసి తమపై, తమ పిల్లలపై కేసులు పెట్టారని పేర్కొన్నారు.

తమను బలవంతంగా ఆ భూమిలో నుంచి ఖాళీ చేయిస్తున్నారని వినతి పత్రంలో తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బర్ల వెంకటేష్, బి.శ్రీను, పి.రామకృష్ణ, పి.రాజు ఉన్నారు.



తహసీల్దార్ శ్రీ వల్లికి వినతి పత్రం ఇస్తున్న బర్లపేట వాసులు

పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా-తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్ శనివారం రద్దు చేశారు. 2వ తిరుపతి-హౌరా(22890) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ (22808) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 4న ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ - సంత్రగచ్చి(22807) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

పలు రైళ్ల రీషెడ్యూల్ : విశాఖపట్నంలో శుక్రవారం రాత్రి 9.05 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-కోర్బా (18518) ఎక్స్‌ప్రెస్ సుమారు 2.30 గంటలు ఆలస్యంగా రాత్రి 11.30 గంటలకు బయలుదేరింది.

- విశాఖపట్నంలో శనివారం బయలుదేరాల్సిన విశాఖపట్నం-బెంగళూరు కంటోన్మెంట్ (08915) స్పెషల్ సుమారు 2 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్

ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా భువనేశ్వర్‌లో జూలై 6వ భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మిర్యాలగూడ, నల్గొండలో ప్రయోగాత్మక హాల్ట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

గౌహతి-సికింద్రాబాద్ మధ్య స్పెషల్

ప్రయాణికుల రద్దీ తగ్గించేందుకు గౌహతి-సికింద్రాబాద్ మధ్య సింగిల్ ట్రిప్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. గౌహతి-సికింద్రాబాద్(05614) స్పెషల్ జూలై 2వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు గౌహతిలో బయలుదేరుతుంది. మరునటి రోజు సాయంత్రం 5.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.35 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-గౌహతి(05613) స్పెషల్ సికింద్రాబాద్‌లో జూలై 9వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 11.45 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 12.50 (మధ్య రాత్రి) గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి మధ్య రాత్రి 1.10గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 10.20 గంటలకు గౌహతి వెళ్తుంది.

గిరిజన బాలికలకు ఐఐటీల్లో సీట్లు

మధురవాడ : మారికవలస ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ ప్రతిభా పాఠశాల (ఎస్ఓఈ)కి చెందిన బాలికలు ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు. కౌన్సెలింగ్‌లో ఎస్. దీప్తి ఫ్లారెన్స్ ఐఐటీ ధన్‌బాద్‌లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో, పి. శరణ్య ఐఐటీ పాట్నాలోని మెటలర్జీ బ్రాంచ్‌లో, ఎం.సమీర, సాయి మేఘన మధ్యప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె. విశ్వనాథం తెలిపారు. విజేతలకు సిబ్బంది, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించిన దీప్తి ఫ్లారెన్స్

వైఎస్సార్ బీమా అందజేత

మధురవాడ: మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది శుక్రవారం అందించారు. కాలనీకి చెందిన వేమ అప్పలరాజు (41) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరైంది. దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా మంజూరైన రూ.10వేలను మృతుని భార్య కనక వెంకట ఆదిలక్ష్మికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్ ఎల్లాజీ, కె.మంగమ్మ, ప్రభాకర్, వెల్ఫేర్ సెక్రటరీ నాగేశ్వరరావు, సత్యవతి పాల్గొన్నారు.



బీమా నగదు అందజేస్తున్న వార్డు అధ్యక్షుడు శ్రీనివాసరావు